క్లుప్తంగా...

అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

సికింద్రాబాద్: లాలాగూడలోని ముస్లిం గ్రేవ్ యార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సహకారంతో గ్రేవ్ యార్డును అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ 71 లక్షల వ్యయంతో గ్రేవ్ యార్డులో సీసీ రోడ్లు, ఫుట్‌పాత్, వజూఖానా, కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్, గార్డెనింగ్, కమాన్ నిర్మాణం తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్పొరేటర్ వెంట శ్రీనివాస్, జీహెచ్ఎంసీ డీఈ పద్మాలత, ఏఈ వేణు, విద్యుత్ ఏడీఈ మహేశ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నజీర్, హాశం, రాజు, రవి, గోపి, అమర్, వెంకటేష్, ఇస్మాయిల్ ఉన్నారు.

చెక్కుల పంపిణీ

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌కు చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరీ, నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి


అబ్దుల్ ఖదీర్‌ఖాన్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని తెలంగాణ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (తుంటియా) రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఖదీర్‌ఖాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలన్నారు. హెల్త్ కార్డులను మంజూరు చేసి ప్రభుత్వ ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని, టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగుల పర్మినెంట్, వర్సిటీ బ్లాక్ గ్రాంట్స్ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: 7వ యునైటెట్ నేషన్స్ గ్లోబల్ సేఫ్టీ వీక్ సందర్భంగా గురువారం బేగంపేటలోని చిల్డ్రన్ పార్కులో నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. యునైటెట్ నేషన్స్ గ్లోబల్ సేఫ్టీ థీమ్‌తో పాటు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలను ఆయన నివృత్తి చేశారు.

హాస్టల్ సిబ్బందిని పార్కులో పని చేయించడం దారుణం



ఉస్మానియా యూనివర్సిటీ: వేసవి సెలవుల్లో హాస్టళ్లు, మెస్‌లను మూసేసి అందులో పనిచేసే సిబ్బందిని ఆక్సిజన్ పార్కులో పని చేయించడం దారుణమని ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్ఎల్ పద్మ మండిపడ్డారు. గురువారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనంతో కూడిన వేసవి సెలవులు ఇవ్వాలంటూ ఓయూలో ఆందోళన చేపట్టారు. పార్కుల పనులపై ఎలాంటి అనుభవంలేని హాస్టల్ సిబ్బందిని మండుటెండల్లో మంచినీళ్ల సౌకర్యాలు లేని ప్రాంతంలో పని చేయిస్తున్నారని వారికి ఏమైనా జరిగితే వర్సిటీ అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. అనంతరం అధికారులను వినతి పత్రం ఇచ్చారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

కాచిగూడ: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం శ్రీ చైతన్య నల్లకుంట బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బంగారు పథకాలను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెంచుకుని ఉంటారని, వారి కలలను నెరవేర్చాలన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం.. పనుల్లో జాప్యం

- డంపింగ్ యార్డును తలపిస్తున్న మున్సిపల్ మైదానం
- వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుకు ఇద్దరు డిప్యూటీలు శంకుస్థాపన
- రెండేళ్లయినా నేటికీ ప్రారంభం కాని పనులు


భవన నిర్మాణ వ్యర్థాలతో నిండిన చిలకలగూడ మైదానం

చిలకలగూడ : బహుళ అంతస్తుల సముదాయం, మల్టీప్లెక్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్, పచ్చందాలు ఏర్పాటు, ఓపెన్ జిమ్, విద్యార్థులకు క్రీడా సౌకర్యం ఇవన్నీ ప్రతిపాదనలకే పరిమితం కాగా ప్రస్తుతం భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్ యార్డుగా మారింది మెట్టుగూడ డివిజన్‌లోని చిలకలగూడ మున్సిపల్ మైదానం. ఇద్దరు డిప్యూటీలు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి దాదాపు రెండేళ్లు అవుతున్నా నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరం. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం డంపింగ్ యార్డుగా మారడం వెనుక ఏదో మతలబు ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 9800 చదరపు గజాల స్థలంలో


రెండేళ్ల క్రితం వాకింగ్‌ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఐదు సెక్టార్లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో 73 మడిగలు, ఫస్ట్ ఫ్లోర్‌లో 57 గదులతో 1982లో చిలకలగూడ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ ప్రారంభమైంది.

రూ.134 కోట్లతో..

నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరడంతో జేఎన్‌టీయూ ఇంజినీర్ల బృందం పరిశీలించి ప్రమాదకరమని ఇచ్చిన నివేదికతో 2014 ఏప్రిల్‌లో భవన సముదాయాన్ని నేలమట్టం చేశారు. తొలుత బీఓటీ (బిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో మల్టీప్లెక్స్ నిర్మించాలని, అనంతరం పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో రూ.134 కోట్ల వ్యయంతో రెండు సెల్లార్లతో భారీ కాంప్లెక్స్ సముదాయం నిర్మించాలని రూపొందించిన ప్రతిపాదనలు బుట్టదాఖలలు అయ్యాయి. అప్పటి నుంచి పలుమార్లు ప్రతిపాదనలు సిద్ధం చేయడం, కార్యరూపం దాల్చకపోవడం పరిపాటిగా మారింది. 2021 జూన్ 26వ తేదీన డిప్యూటీ స్పీకర్ పద్మారావు, డిప్యూటీ మేయర్ శ్రీలత రూ.4.40 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయగా, రెండేళ్లు అవుతున్నా నేటికి పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. కేటాయించిన నిధులు ఏమయ్యావనే ప్రశ్న స్థానికుల్లో నెలకొంది. స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి చిలకలగూడ మున్సిపల్ మైదానాన్ని అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా తగిన కార్యాచరణ సిద్ధం చేసి కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రూ.4.5 కోట్లతో ఈఎస్‌ఐ గ్రేవ్‌యార్డు అభివృద్ధి


అధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని


స్థానికులతో మాట్లాడుతూ..

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: అన్ని సౌకర్యాలతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే విధంగా ఈఎస్ఐ గ్రేవ్ యార్డును అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ, ఇంజినీరింగ్, పారిశుధ్య అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. అమీర్‌పేట్ డివిజన్‌లోని ఈఎస్ఐ గ్రేవ్‌యార్డు అభివృద్ధి కోసం రూపొందించిన నమూనాలను జోనల్ కమిషనర్ రవికిరణ్ మంత్రికి ఫొటో ప్రదర్శన ద్వారా వివరించారు. సుమారు ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ గ్రేవ్ యార్డును రూ.4.5 కోట్లను వెచ్చించి అభివృద్ధి చేసి ఏడాదిలోపు అందుబాటులోకి తెస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులను అధికారులు వారంలో రెండు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి వేగంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల మంజూరు, అనుమతి ప్రక్రియలో జాప్యం జరుగకుండా చూడాలని ఆదేశించారు. బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే అభివృద్ధి పనులు గుర్తించి సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, రవికిరణ్, డీసీ ముకుంద్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, ఇందిర పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్ మంత్రి పర్యటన..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ సీ-క్లాస్‌లో గురువారం మంత్రి తలసాని, కార్పొరేటర్ కె. హేమలతతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి పర్యటించారు. తమకు మంచినీటి కనెక్షన్లు ఇప్పించాలని మహిళలు విజ్ఞప్తి చేయగా జలమండలి జీఎం ప్రభును నీటి కనెక్షన్ ఇవ్వాలని కోరారు. బస్తీలో ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలుగా నూతన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు కోసం ప్రతిపాదనలు రూపొందించాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులను ఆదేశించారు. స్థానికంగా కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం రూ. 25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి వెంట నాయకులు ఎల్. వెంకటేష్, లక్ష్మీపతి, ప్రేమ్, వెంకటరమణ, ఫయిమ్, అబ్బాస్, కుమార్ యాదవ్, రాజేందర్, నాగభూషణం ఉన్నారు.

'బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వం'


ఓబీసీ సమ్మేళనానికి వెళ్తున్న నేతలు

లాలాపేట: జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని సికింద్రాబాద్ మహంకాళి ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క గణేష్‌రావు ఆరోపించారు. గురువారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో జరిగిన ఓబీసీ సమ్మేళన కార్యక్రమానికి తార్నాక నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో బీసీ మంత్రులు ముగ్గురు మాత్రమే ఉంటే, కేవలం సీఎం కేసీఆర్ కుటుంబం నుంచే నలుగురు మంత్రులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, శారదా మల్లేష్, వెంకటేష్‌గౌడ్, సారంగపాణి, ఆకుల శ్రీనివాస్, వేణుయాదవ్, పోచయ్య, బండపల్లి సతీష్, ఆదం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

44వ రోజుకు చేరిన రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న బస్తీ వాసులు

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మాణం చేద్దామంటూ ఓయూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 44 రోజుకు చేరింది. గురువారం దీక్ష చేపట్టిన వారికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలకుంట లింగయ్య, వేముల శ్రీనివాస్, ఒర్సు కృష్ణ మద్దతు తెలిపి మాట్లాడారు.దాదాపుగా 30 వేల మంది ఉన్న బస్తీ ప్రజల కోసం హాస్పిటల్ ఏర్పాటు చేయాలంటూ గత 44 రోజుల నుంచి రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులకు కనీసం చలనం లేదన్నారు. అధికారంలో ఉండి హాస్పిటల్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ చేయకుండా ఉన్న పాలకులకు బస్తీ వాసులు తమ ఓటు అనే ఆయుధంతో తగిన విధంగా స్పందిస్తారని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ శైలజ


పద్మారావునగర్: ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజ సూచించారు. గురువారం బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ హాజరై మాట్లాడారు. దారిద్ర్యరేఖకు దిగువ నున్న పేద వర్గాల కోసం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, విడో, వృద్ధాప్య, ఒంటరి మహిళా పెన్షన్లను అందిస్తున్నారన్నారు. 58, 59 జీవో కింద ఏళ్ల తరబడి నుంచి ప్రభుత్వ స్థలంలో ఉంటున్న పేదలు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం ఇందుకోసం సమయం ఇచ్చిందని ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, కేఎం క్రిష్ణ, రాంబాబు ఎల్. వెంకటేశన్, ఎస్. రాజేందర్, ముక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణపై హామీని నిలబెట్టుకోవాలి


ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: క్రమబద్ధీకరణపై 2015 లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో జేఎల్, డీఎల్, పాలిటెక్నికల్ కాలేజీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసి కేవలం వర్సిటీల అధ్యాపకులను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కాంట్రాక్టు అధ్యాపకులను జూన్ 2న జరిగే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

'ఓబీసీలపై ప్రభుత్వం చిన్నచూపు'


సమ్మేళనానికి వెళ్తున్న నాయకులు

కాచిగూడ: ఓబీసీల పట్ల కేసీఆర్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన ఓబీసీ సమ్మేళన కార్యక్రమానికి కేశబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ బీసీల పట్ల ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

'గురుకుల' దరఖాస్తుల గడువును పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల డీఎల్, జేఎల్ దరఖాస్తుల గడువును మరో 15 రోజులు పొడిగించాలని ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు ఎనుగంటి రాజునేత కోరారు. సాంకేతిక కారణాలతో పాటు, ఇతర అనేక సమస్యలతో అర్హత గల నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోలేకపోయారని తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత పెద్ద సంఖ్యలో అధ్యాపక ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైనందున దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 17న రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-9 ఎస్కలేటర్ వద్ద దాదాపు 40 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి చనిపోయి పడి ఉన్నట్లు గుర్తించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి ఎడమ చేతిపై నాగమణి అనే పేరుతో పచ్చబొట్టు ఉందని చెక్స్ షర్టు, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నాడని సంబంధీకులు ఉంటే రైల్వే పోలీసులకు ఆశ్రయించాలన్నారు.

'దర్శన్ బస్సు'లను వినియోగించుకోవాలి

రాంగోపాల్‌పేట్: ప్రతి శని, ఆదివారాల్లో హైదరాబాద్ నగరంలోని పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన హైదరాబాద్ దర్శన్ బస్సులను వినియోగించుకోవాలని డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి తెలిపారు. రెతిఫైల్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శని, ఆదివారాల్లో ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే ఆల్ఫా హోటల్ వద్ద నుంచి ఈ బస్సు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు అక్కడికే చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో గైడ్ ఉండి ప్రతి పర్యాటక ప్రదేశం యొక్క చరిత్ర, దాని ప్రాముఖ్యతను వివరిస్తారన్నారు. పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.130, ఏసీ బస్సులో పెద్దలకు రూ.450, పిల్లలకు రూ.340 చెల్లించి అన్ని ప్రదేశాలను సందర్శించి రావచ్చని చెప్పారు.

హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోండి


సికింద్రాబాద్: హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఐటీయూసీ వర్కర్స్ యూనియన్ సికింద్రాబాద్ ఏరియా అధ్యక్షులు ఎస్. లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు జి. మల్లేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల భవిష్యత్తే దేశ భవిష్యత్ అని భావించి సుప్రీం కోర్టు ప్రకటనలో వెయ్యి రూపాయలు పొందే వారు ఏడు వేల రూపాయలు పొందే అవకాశం కోట్ల మంది పెన్షన్‌దారులకు కలిగిందన్నారు. దీనికి గాను జూన్ 27 వరకు గడువు విధించినట్లు పేర్కొన్నారు.

'యాదగిరిగుట్ట' భక్తుల ఇబ్బందులపై కమిషనర్‌కు ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

రాంగోపాల్‌పేట్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు పడుతున్న ఇబ్బందులపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు జన తెలంగాణ రైట్ సొసైటీ సభ్యులు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న సాక్షిలో 'యాదాద్రీశా.. ఇదేమిగోస' అనే శీర్షికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తెలంగాణలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు స్వాగతం పలికే అధికారులు సామాన్య భక్తులకు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న రాంచందర్

కాచిగూడ: విద్యార్థులు పూర్తిగా పాఠ్యపుస్తకాలపైన ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) అధ్యక్షుడు వి.రాంచందర్ అన్నారు. కాచిగూడలోని ఆర్.జి. కేడియా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేనేజ్‌మెంట్ రంగంలో విస్తృతమైన అవకాశాలున్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్.జి.కేడియా కళాశాలలో విద్యార్థులను యువ మేనేజర్లుగా తీర్చిదిద్దడానికి శిక్షణ కార్యక్రమాలను చేపట్టేలా హెచ్ఎంఏ మార్వాడీ శిక్షా సమితితో ఒప్పందం చేసుకున్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ కార్యదర్శి సురేంద్ర లూనియా, సీఏ ఎస్‌బీ కాబ్రా, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డీవీజీ కృష్ణ, ప్రొఫెసర్ వందన సాంబ, డాక్టర్ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

పార్కుల పరిశుభ్రతకు సహకరించాలి


పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

చిలకలగూడ : నగరంలోని పార్కులను పరిశుభ్రంగా ఉంచేందుకు జీహెచ్ఎంసీ ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమం చిలకలగూడ నాగులూరి జీహెచ్ఎంసీ పార్కులో గురువారం కొనసాగింది. పార్కులు పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన జీవనం లభిస్తుందని వివరిస్తూ పార్కుల పరిశుభ్రతకు తనవంతు కృషి చేస్తానని పారిశుధ్య విభాగ ప్రతినిధులు వాకర్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పార్కును శుభ్రం చేశారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో పార్కులను పరిశుభ్రం చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్కు ప్రతినిధి రవి, పారిశుధ్య విభాగ సిబ్బంది ధనగౌడ్, యమున, దశరథ్, రమేష్, శ్రీకాంత్, ఆనంద్, సంజీవ్, రాజ్‌కుమార్, కళ, రవీందర్, మొగులయ్య, వాకర్స్ బాలరాజు, రాజీవ్, సరిత పాల్గొన్నారు.

వ్యవసాయం, సాహితీసేద్యం చేసిన గొప్పకవి గంగుల సాయిరెడ్డి

చిక్కడపల్లి: రైతుగా నాగలి పట్టి వ్యవసాయం చేస్తూనే మరోవైపు కలం పట్టి సాహితీ సేద్యం చేసిన గొప్ప కవి గంగుల సాయిరెడ్డి అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమాలలో భాగంగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో జన్మించిన భాగవత కర్త పోతన వ్యవసాయం చేస్తూనే కావ్య రచనలు చేశారని తదుపరి కాలంలో సాయిరెడ్డి ఆయనను అనుసరించిన భూమిపుత్రుడు అని వివరించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. రైతుల జీవితాల్లోని చీకటి వెలుగులను కవితా వస్తువుగా సాహిత్యా రచనలు చేసిన సాయిరెడ్డి సామాజిక సంస్కర్త అన్నారు. గీత రచయిత వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ.. సాయిరెడ్డి వంటి పలు తెలంగాణ కవుల రచనలు నేటి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో గానసభను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటే తమవంతుగా సహకరిస్తామన్నారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న న్యాయవాదులు

కవాడిగూడ: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే న్యాయవాదుల కోసం రక్షణ చట్టాన్ని తీసుకురావాలని హైకోర్టు న్యాయవాదులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదులు బాలాజీ, అనిల్ కుమార్, నాగరాజు, దస్తి, రమణ, అశోక్ మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ న్యాయవాదులకు రూ.15 వేల నుంచి రూ. 20వేల వరకు స్టైఫైండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిటీ సివిల్ కోర్టు, నాంపల్లి కోర్టులో న్యాయవాదులపై దాడులు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.